TGTEL/25/A3750


... నిజమే ...

# నిజాయితి

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 209 నెట్‌వర్క్ ఇంచార్జ్ & మెయింటెనెన్స్ : గుండూర్ శ్యామ్ . గురువారం 02 జులై 2026 వెల 4:00

“నిజాయితీ” ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



## కృత్రిమ మేధతో ట్రాఫిక్ సిగ్నళ్లు

- వాతావరణ మార్పులు, రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్
- క్రమబద్ధీకరణ సిఎం రేవంత్ సమక్షంలో అనలాగ్, మేఘా ఇంజినీరింగ్ నడుమ అవగాహన ఒప్పందం
- నీటి లీకేజిలను ముందుగానే గుర్తించి మరమ్మతులు
- అవసరానికి తగ్గట్టు విద్యుత్ వినియోగం ప్రాజెక్టుల - పురోగతిపై చర్చ



**హైదరాబాద్, జులై 01 (నిజాయితి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండి పి. కృష్ణారెడ్డి ఎంసిఆర్‌హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో బుధవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండి బి. అజిత్ రెడ్డిలు పాల్గొన్నారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్ తరాలకు అవసరమైన మేథోపరమైన మౌలిక సదుపాయాలు), ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు.

హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. నగరంలో ఆధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫాం వినియోగం వల్ల ప్రయోజనాలను వారు తెలిపారు. సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వారు వివరించారు.

**అనలాగ్, ఎంఈఐఎల్‌ల అవగాహన ఒప్పందం**

ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేలా ఏఐకి అనుసంధానించాలని సిఎం ఆదేశించారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పరం సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది.

## ఒకేసారి 5 అవయవాల మార్పిడి

- ఏకబిగిన 36 గంటల శస్త్రచికిత్స
- దేశంలోనే అరుదైన రికార్డు
- ఉస్మానియా ఆస్పత్రి వైద్యుల ఘనత
- వైద్యులను అభినందించిన పిఎం మోదీ, సీఎం రేవంత్



**హైదరాబాద్, జులై 01 (నిజాయితి):** ఏకబిగిన 36 గంటలపాటు శ్రమించి పేషెంట్‌కు ఒకేసారి ఐదు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు, ఇతర సిబ్బందికి పిఎం మోదీ మరియు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

**దేశంలోనే అరుదైన రికార్డు:**

1. సిరిసిల్లకు చెందిన 30 ఏళ్ల యువ ఇంజనీర్‌కు జీర్ణాశయం, డ్యూడెనమ్, ప్యాంక్రియాస్, చిన్నపేగు, పెద్దపేగు అవయవాలను ఒకేసారి మార్పిడి చేసి దేశంలోనే అరుదైన రికార్డును సాధించారు.
2. ఐదు ప్రధాన అవయవాలను ఒకేసారి ట్రాన్స్‌ప్లాంట్ చేయడం వైద్య రంగంలో అత్యంత క్లిష్టమైన ప్రక్రియ.

సీఎం ప్రశంసలు: జాతీయ వైద్యుల దినోత్సవం రోజున ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్య బృందం ఈ విజయాన్ని సాధించి వైద్య వృత్తికి మరింత ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. 36 గంటలు విశ్రాంతి లేకుండా శ్రమించిన వైద్యులు, సిబ్బంది అంకితభావం అభినందనీయమని కొనియాడారు.

## రెండోరోజు రైతుభరోసా రూ.1590 కోట్లు

### 10.68 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నిధులు



**హైదరాబాద్, జులై 01 (నిజాయితి):** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా పథకం కింద రెండో విడతలో మూడు ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో బుధవారం రూ.1,590.02 కోట్లను నేరుగా జమ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ విడతలో 10.68 లక్షల మంది రైతులు, 26.50 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించిన రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విడతల వారీగా రైతుభరోసా నిధులను విడుదల చేస్తున్నామని చెప్పారు. మంగళవారం మెదటి దశలో రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 44.27 లక్షల మంది రైతులకు, రూ.2482.02 కోట్ల నిధులు విడుదల చేయగా, రెండవ రోజు రెండు నుంచి మూడు ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ చేసినట్లు చెప్పారు.

**భరోసా నిధుల విడుదల జిల్లాల వారీగా ఇలా** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసాలో నల్గొండ జిల్లా అత్యధికంగా 4,06,875 మంది రైతులకు రూ.314.91 కోట్లు అందుకుని రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అత్యల్పంగా 20,971 మంది రైతులకు రూ.11.20 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. అనంతరం సంగారెడ్డి జిల్లాకు 2,91,800 మంది రైతులకు రూ.198.88 కోట్లు, ఖమ్మం జిల్లాకు 2,71,027 మంది రైతులకు రూ.198.15 కోట్లు, సిద్దిపేట జిల్లాకు 2,66,722 మంది రైతులకు రూ.186.89 కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లాకు 2,29,721 మంది రైతులకు రూ.186.31 కోట్లు విడుదలయ్యాయి. కామారెడ్డి జిల్లాలో 2,59,093 మంది రైతులకు రూ.173.81 కోట్లు, సూర్యాపేట జిల్లాలో 2,28,156 మంది రైతులకు రూ.172.23 కోట్లు, వికారాబాద్ జిల్లాలో 2,19,389 మంది రైతులకు రూ.170.19 కోట్లు, నిజామాబాద్ జిల్లాలో 2,19,892 మంది రైతులకు రూ.164.23 కోట్లు జమయ్యాయి.

రంగారెడ్డి జిల్లాలో 2,35,943 మంది రైతులకు రూ.157.16 కోట్లు, మెదక్ జిల్లాలో 2,36,481 మంది రైతులకు రూ.138.14 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో 1,69,646 మంది రైతులకు రూ.132.07 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,79,917 మంది రైతులకు రూ.129.62 కోట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో 1,81,907 మంది రైతులకు రూ.126.51 కోట్లు అందాయి. జగిత్యాల జిల్లాలో 1,87,445 మంది రైతులకు రూ. 123.86 కోట్లు, నిర్మల్ లో1,38,256 మంది రైతులకు రూ.115.97 కోట్లు, జనగాం జిల్లాల్లో 1,42,617 మంది రైతులకు రూ. 109.66 కోట్లు, నారాయణపేట 1,33,325 మంది రైతులకు రూ. 109.11 కోట్లు, కరీంనగర్‌లో 1,57,948 మంది రైతులకు రూ. 108.61 కోట్లు రైతుల ఖాతాల్లో పడ్డాయి.

జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో 1,24,433 మంది రైతులకు రూ. 106.87 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెంలో 1,15,431 మంది రైతులకు రూ. 103.59 కోట్లు, వనపర్తిలో1,45,543 మంది రైతులకు102.59 కోట్లు, వరంగల్‌లో 1,34,427 మంది రైతులకు రూ. 96.03, ఆదిలాబాద్‌లో 87,419 మంది రైతులకు రూ. 95.64 కోట్లు, మంచిర్యాలలో 1,20,025 మంది రైతులకు రూ. 90 కోట్లు పడ్డాయి. పెద్దపల్లిలో 1,27,906 మంది రైతులకు రూ. 88.49 కోట్లు, హన్మకొండలో 1,22,245 మంది రైతులకు రూ. 86.15 కోట్లు, రాజన్న సిరిసిల్లలో 1,01,666 మంది రైతులకు రూ. 75.76 కోట్లు, కొమురంభీం ఆసిఫాబాద్‌లో 81,448 మంది రైతులకు రూ. 75.72 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 93,768 మంది రైతులకు రూ.73.68 కోట్లు, ములుగు జిల్లాలో 64,030 మంది రైతులకు రూ.49.87 కోట్లు, జమ అయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,01,666 మంది రైతులకు రూ.75.76 కోట్లు జమయ్యాయి.

## నేడు కెబినెట్ భేటీ

**హైదరాబాద్, జులై 01 (నిజాయితి):** రాష్ట్ర మంత్రివర్గం గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు సమవేశం కానున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలోని ఈ సమావేశం జరుగన్నుది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పలు కీలక అంశాలపై ఈ సమావేశఃలో చర్చించనున్నది. గత కెబినెట్ సమావేశంలో అధికారుల లేకుండా నిర్వహించడంతో అధికారికంగా తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఇందులో చర్చించి ఆమోదించనున్నారు. ముఖ్యంగా ఇందులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రామీణ ఉపాధి హామీ చట్టం వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్(విబిజీరామ్‌జీ) ను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

ఈ పథకంపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా రాష్ట్రాలతో కలిసి భవిష్యత్ కార్యచరణను రూపొందించుకుంటామని ఇది వరకే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు దీనిపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై తీసుకొచ్చిన జీఓ నెంబర్ 9 పై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దీనిపై పునఃసమీక్షించే అవకాశం ఉందని చెప్తున్నారు. తాజాగా రైతు భరోసా నిధులు సమకూర్చు, ఉద్యోగులు, ఫించనర్లకు చెల్లించాల్సిన బకాయిల విడుదలకు అవసరమైన నిధులు సమీకరణకు తీసుకుంటున్న చర్యలపై కెబినెట్ విస్తృతంగా చర్చించే అవకాశం ఉందని సమాచారం.

TGTEL/25/A3750 ... నిజమే ...

నిజాయితి

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

నిజాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకు వెళ్లే తెలుగు దినపత్రికతో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను వివరాలకు సంప్రదించండి

9441946907

గురువారం
జులై 02, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యులకు ఘన సన్మానం



**జడ్చర్ల, జులై 01 (నిజాయితి):** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాదేపల్లి పట్టణంలోని ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం గంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న డాక్టర్ మనుప్రియను కూడా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు అంకితభావంతో అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో విలువైనవని కొనియాడారు. ప్రతి పరిస్థితిలోనూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న వైద్యుల సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు.

ఈ కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా సభ్యుడు గోపాల్ గౌడ్, రాధాకృష్ణతో పాటు ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

## పాత ఉపాధి హామీ చట్టాన్నే యథావిధిగా అమలు చేయాలి

### తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం

**జడ్చర్ల, జులై 01 (నిజాయితి):** జడ్చర్ల, జూలై 1 (నిజాయితి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలే జగన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేద కుటుంబాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులతో సంవత్సరానికి 100 రోజుల ఉపాధి, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు, వేసవి అలవెన్స్, నిరుద్యోగ భృతి వంటి సంక్షేమ ప్రయోజనాలు కల్పించిందని తెలిపారు. అయితే జూలై 1, 2026 నుంచి అమల్లోకి తీసుకొచ్చిన వి.బి.జి. రామ్‌జీ చట్టం ద్వారా కేంద్రం 60



శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాలనే నిబంధన విధించడంతో పాటు, అనేక షరతుల కారణంగా పేదలకు ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 125 రోజుల ఉపాధి కల్పిస్తామని ప్రకటిస్తే, అందుకు సంవత్సరానికి సుమారు రూ.3.5 లక్షల కోట్ల బడ్జెట్ అవసరమని, కానీ ఈ ఏడాది కేవలం రూ.95 వేల కోట్లే కేటాయించడం వల్ల పనిదినాల్లో కోత విధించే ఉద్దేశమే స్పష్టమవుతోందని ఆరోపించారు. ఉపాధి కూలీలకు నష్టం కలిగించే వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి, పాత ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్, రైతులకు ఇబ్బందికరంగా మారనున్న జాతీయ విత్తన చట్టాన్ని కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జడ్చర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే కిష్టంపల్లి, బూరుగుపల్లి, ఆలూరు, నసుల్లాబాద్, నసురుల్లాబాద్ తాండా, లింగంపేట్ గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు కూడా వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పి. సాయిలు, ఇ. యాదయ్య, వి. శ్యాంసుందర్, కర్ణాకర్, ఇస్తారయ్య, నాగమ్మతో పాటు సీఐటీయూ కార్యకర్తలు, రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.




## ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో ఘనంగా నారాయణకు

# పదవి విరమణ వీడ్కోలు సన్మానం

**నాగర్‌కర్నూల్, జులై 01 (నిజాయితి):** నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో గత నాలుగు సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న కే. నారాయణ కు పదవి విరమణ వేడుకలు సందర్భంగా సూపర్డెంట్ డాక్టర్ టి.ఉషారాణి పూలమాలలు, శాలువాలలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సాధరణ ఆస్పత్రిలో నారాయణ సేవలు సంతృప్తికరమని అన్నారు. గతంలో రెవెన్యూ శాఖలో గద్వాల తిమ్మాజీపేటలో పనిచేసినట్లు తెలిపారు. అనంతరం పదవి విరమణ ధ్రువీకరణ పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు సిజే వసంత్ కుమార్,మోహన్ బాబు,రవి,గాలిబ్ అలీ, ఆయన కుటుంబ సభ్యులు జంగమ్మ,గణేష్ ,గౌరీశ్రీ, చంద్రకాంత్,శిరీష, సహ ఉద్యోగులు,వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వైద్యులు సమాజానికి దేవుళ్లు



**నాగర్‌కర్నూల్, జులై 01 (నిజాయితి) :** అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో సూపర్డెంట్ డాక్టర్ టి.ఉషారాణి మరియు వైద్యులకు జిల్లా క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ బి సి రాయి జన్మదిన వర్ధంతి సందర్భంగా వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. వైద్యులు ప్రజల ఆరోగ్యం కాపాడుటలో విశేష సేవలు అందిస్తున్నారని, ముఖ్యంగా కరోనా సమయంలో వైద్యుల విలువ తెలిసిందని అన్నారు. అత్యవసర సమయంలో, ప్రాణాపాస్థితి లో ఉన్న సందర్భాల్లో వైద్యుల సేవలు ఆమోగమని అన్నారు. క్లాస్మేట్ క్లబ్ ద్వారా ఇటీవల నీట్ లో ఎంబిబిఎస్ సాధించిన విద్యార్థినికి నర్సింగ్ అధికారి సుప్రజా అందించిన ఆర్థిక సాయం అందజేశారు. ఆర్ఎంఓ డాక్టర్ రవి శంకర్ మాట్లాడుతూ క్లాస్మేట్ క్లబ్ ద్వారా ఆసుపత్రులు పలు సేవా కార్యక్రమాలు గత కొన్ని సంవత్సరాలుగా పాల్గొంటుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో క్లాస్మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి సి. రమణకుమార్,వాస లక్ష్మి రాఘవేందర్, వాణి, మిడిదొడ్డి సాయిరాం, ఆస్పత్రిలోని అన్ని విభాగాల ఆధిపతులు, ఆర్ఎంవోలు,వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# అష్టమ బ్రహ్మోత్సవాలు విజయవంతం

## సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన ఆలయ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్



**నాగర్‌కర్నూల్, జులై 01 (నిజాయితి) :** నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంగోవింద క్షేత్రంలో నిర్వహించిన అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో విశేష పూజలు, హోమాలు, స్వామివారి కళ్యాణోత్సవం, పల్లకి సేవలు, అన్నప్రసాద వితరణ, తీర్థప్రసాద వినియోగం తదితర ధార్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడంలో విశేషంగా కృషి చేసిన ఆలయ ప్రధాన అర్చకులు, అర్చక స్వాములు, దాతలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు, స్వచ్ఛంద కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, పోలీసు శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రతి భక్తునితో పాటు నాగర్‌కర్నూల్ పట్టణ ప్రజలందరిపై శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి దివ్య కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. స్వామివారి అనుగ్రహంతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.



# సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం



**జడ్చర్ల, జులై 01 (నిజాయితి) :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్చర్ల పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రముఖ వైద్యులతో పాటు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, సమాజంలో వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ వైద్యులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం గౌరవాధ్యక్షులు బాద్మి శివకుమార్, కాట్రేపల్లి లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు బాదేపల్లి శంకర్ బాబు, ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఎం. బుచ్చిరెడ్డి, ఆరోగ్య కార్యదర్శి జి. సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షురాలు జమీల బేగం, పెద్ది పెంటయ్య, కాలారు జనార్దన్, జనార్దన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఇమాముద్దీన్, కృష్ణయ్య, చిరంజీవి, దత్తు కుమార్, బెజగం గోపాల్, మంచన విఠలయ్య, గుబ్బ అశోక్ కుమార్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

TGTEL/25/A3750
... నిజమే ...
# నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
గురువారం
జులై 02, 2026
GENERAL జనరల్ NEWS

## డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, చైల్డ్ వెల్ఫేర్ సంయుక్త ఆధ్వర్యంలో

# ఆపరేషన్ ముస్కాన్ పై అవగాహన



డి. రమాకాంత్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్

**నాగర్‌కర్నూల్, జులై 01 (నిజాయితి) :** డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణం నాగర్ కర్నూల్ లో తేదీ 1-7-2026 నాడు ఆపరేషన్ ముస్కాన్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి. రమాకాంత్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ మరియు చైర్మన్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ గారు హాజరై మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్' అనేది తప్పిపోయిన, అనాథలుగా మారిన, మరియు బాలకార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను రక్షించి, వారికి పునరావాసం కల్పించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ఒక ప్రత్యేకమైన కార్యక్రమం. రాష్ట్రంలో ప్రతి ఏడాదీ జూలై నెలంతా ఈ డ్రైవ్ కొనసాగుతుంది అన్నారు. గారు మాట్లాడుతూ పిల్లలను అక్రమంగా రవాణా చేసే ముఠాలను పట్టుకోవడం, మైనర్లతో పనిచేయించుకునే యజమానులపై బాల కార్మిక నిషేధ చట్టం మరియు వెట్టిచాకిరి నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేస్తారు అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా వేలాది మంది చిన్నారులకు కొత్త జీవితాన్ని అందించింది అన్నారు. ఎస్.పి సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ మాట్లాడుతూ మీ ప్రాంతంలో బాలకార్మిక సమస్యలు లేదా తప్పిపోయిన పిల్లల గురించి తెలిస్తే చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కు గాని పోలీస్ లకు గానీ సమాచారం ఇవ్వాలి అన్నారు. బాల్యాన్ని వెట్టి నుంచి విడిపించేందుకు 'ఆపరేషన్ ముస్కాన్ అనేది గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం సందర్భంగా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలలో బాల కార్మికులు దొరికినట్లైతే ఆయా యజమానులపై బాల కార్మిక












ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు హోటళ్లు, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, మరియు ప్రమాదకరమైన పని ప్రదేశాల నుండి పిల్లలను రక్షించడం. రక్షించబడిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం లేదా చైల్డ్ కేర్ హోమ్స్ (శిశు గృహాలు) లో చేర్చడం అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ బాల కార్మికులను రక్షించడానికి ఇది ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. శ్రీమతి ఏ శ్రీదేవి సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ

నిషేధ చట్టం, వెట్టిచాకిరి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేస్తాం అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీమతి ఏ శ్రీదేవి సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ,కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్. పి సంగ్రామ్ సింగ్ జి పాటిల్, అడిషనల్ ఎస్పీ, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# పేదింటి పెళ్లిళ్లకు ప్రభుత్వ భరోసా

## జడ్చర్లలో కళ్యాణలక్ష్మిషాదీ ముబారక్ చెక్కుల పంపిణీ - లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, జులై 01 (నిజాయితి) :** పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక అండగా కళ్యాణలక్ష్మిషాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా చెక్కులు అందజేశారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సామాన్య కుటుంబాలపై వివాహాల ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బైరి కమ్మరోళ్లకు ప్రత్యామ్నయం నివాసాలు ఏర్పాటు చేయాలి

## గూడు కోల్పోయిన బాధితులకు ఇండ్ల స్థలాలు చూయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య డిమాండ్

**నాగర్‌కర్నూల్, జులై 01 (నిజాయితి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గత 35 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న బైరి కమ్మరోళ్ళకు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపాన గత 35 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న బైరి కమ్మరోళ్లకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నో ఏండ్లుగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో చేతి వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారికి ఇక్కడే ఆధార్ కార్డు రేషన్ కార్డు అన్ని కల్పించిన ప్రభుత్వం ఏ ఆధారంగా వారిని తొలగించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఇందిరమ్మ ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటూ వేదికల మీద ప్రసంగాలు చెపుతున్న నాయకులు బుల్ డోజర్లతో పేదల నివాసాల పైకి చిరు




వ్యాపారుల పైకి పంపి వారి జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తుందని ఆయన అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వమా లేక బీజేపీ ప్రభుత్వమా అని ఆయన ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుల్ డోజర్ల పాలనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో అమలు చేస్తుంటే బిజెపి విధానాలే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్నారని అని ఆయన అన్నారు. ఇన్ని సంవత్సరాలుగా పట్టణంలో నివసిస్తున్న వారికి కనీసం ఇళ్ల స్థలాలు చూపించలేని ప్రభుత్వం ఇప్పుడేమో అర్ధాంతరంగా వాటి తొలగించి వారి జీవితాలను రోడ్డుపాలు చేసిందని ఆయన అన్నారు. అందులో భాగంగా ఖమ్మం హనుమకొండ మహబూబాబాద్ జిల్లాలలో పేదలు వేసుకున్న గుడిసెలను దుర్మార్గంగా తొలగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వాన్ని చెప్పుకునే అర్హత లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా గూడు కోల్పోయిన బైరి కమ్మరోళ్ళకు ఇండ్ల స్థలాలు చూపించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తే అప్పుడు కానీ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన నడుస్తుందని ప్రజలు గమనిస్తారని ఆయన అన్నారు. కావున గూడు కోల్పోయిన పేదలకు ఇంటి స్థలాలు చూయించి ఇందిరమ్మ ఇండ్లు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# బొప్పల్లిలో పిచ్చికుక్క వీరంగం

**తెల్కపల్లి, జులై 01 (నిజాయితి) :** తెల్కపల్లి మండలం బొప్పల్లిలో పిచ్చికుక్క వీరంగం 8 మందిని పట్టిపీకిన పిచ్చి కుక్క. తెల్కపల్లి పిహెచ్‌సిలో నో యాంటి రాబిక్ స్టాక్. నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలింపు.

కొనసాగుతున్న చికిత్స









# ఎన్యూమరేషన్ ఫామ్‌ల పంపిణీ

**తెల్కపల్లి, జులై 01 (నిజాయితి) :** SIR లో భాగంగా తెలకపల్లి మండల కేంద్రంలో బుధవారం నాడు 187 బూతు 11, 12 వార్డుల్లో BLO, BLAలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫాం పంపిణీ చేయడం జరిగింది. BLO అక్బరి, BLA ఫరీద్ పాల్గొన్నారు.



## నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు

**నాగర్‌కర్నూల్, జూన్ 30 (నిజాయితి) :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తేది 1 జులై, మంగళవారం జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయం నందు డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ లయన్ రాధాకృష్ణ మాట్లాడుతూ, "వైద్యో నారాయణో హరి:" అన్న సూక్తిని నిజం చేస్తూ సమాజ ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కోవిడ్ లాంటి విపత్కర సమయాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన వైద్యుల త్యాగం మరువలేనిదని అన్నారు. ఈ



సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఐతీ. కృష్ణ గారిని శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి, కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి, కాబినెట్ సభ్యులు రాజవర్ధన్ రెడ్డి, మాజీ జోన్ చైర్మన్ రాధారెడ్డి, మాజీ అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి,దొడ్ల ఈశ్వర్ రెడ్డి, ఇందుమతి, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, మహిళా సభ్యులు లక్ష్మి, స్వరూప మరియు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### పేదలకు ఇల్లు, ఇంటి జాగల కొరకు నాగర్‌కర్నూల్ సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో

# కలెక్టరేటు ముందు మహా ధర్నా

**నాగర్‌కర్నూల్, జులై 01 (నిజాయితి) :**
జిల్లాలో రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది నిరుపేదలకు భూదాన భూమి, ఇతర ప్రభుత్వ భూముల్లో ఇంటి స్థలాలు కేటాయించాలని అర్హులైన పేద ప్రజలకు ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో స్థానిక నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనరసింహ మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు వేల ఎకరాలు డబ్బున్న బడాబాబులు కబ్జా చేస్తున్న వాటిపై పల్లెత్తు మాట కూడా మాట్లాడని ప్రభుత్వాలు పేద ప్రజలు వేసుకున్న గుడిసెలను కూలగొడుతూ వాళ్ళని తీవ్రంగా హింసిస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీల ఐక్య పోరాటాలకు ఇది నాంది అని, ఇకపై ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాలని కచ్చితంగా ప్రశ్నిస్తూనే ఉంటామని ఆయన వివరించారు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జిల్లాలోని అనేక గ్రామాలలో ఇల్లు స్థలాలు లేని పేదలకు ఇంటి జాగాలు కేటాయించడానికి కొనుగోలు చేసిన భూములను ప్రభుత్వం పేద ప్రజలకు పంచకుండా ఇతర కార్యక్రమాలకు వాడుకుంటున్నదని ఆయన విమర్శించారు ప్రజా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిల్లాలో వందల కొద్ది గ్రామాల్లో ఇంటి జాగా లేని నిరుపేద కుటుంబాలు ఉన్నాయని ఆయన వివరించారు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ జిల్లాలో అనేక అడవి, అసైన్మెంట్ భూములను కార్పొరేట్ కంపెనీలు కన్నేసి అక్రమంగా కబ్జా చేస్తుంటే వాటిని నివారించలేని ప్రభుత్వాలు పేద ప్రజలు ఎక్కడైనా జానెడు గుడి చేసుకుంటే ఇల్లు కట్టుకుంటే దాని కూల్చేందుకు పరుగులు తీయడం అనేది ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈనెల 6వ ఇదే అంశాలపై హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవలు గౌడ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శీను, దేశా నాయక్, కందికొండ గీత, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, ఆర్ ఇందిర, శంకర్ గౌడ్, బొల్లెద్దుల శ్రీనివాసులు, బండి లక్ష్మీపతి, శివశంకర్, సిపిఎం శ్రీనివాసులు, నరసింహ, ఆంజనేయులు, రామయ్య, ఆంజనేయులు, బాలస్వామి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు టి మల్లయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాసులు, ఏఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, కిరణ్ కుమార్ ,వి రవీందర్ ,కృష్ణాజి మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




### శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్, ఇతర సిబ్బందికి 26 వేల కనీసం వేతనం అమలు చేసి, ప్రతినెల 1నే చెల్లించాలి

**AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**

**అసిఫాబాద్, జులై 01 (నిజాయితి) :**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్,పేషంట్ కేర్,సెక్యూరిటీ గార్డ్ మరియు ఇతర సిబ్బందికి కనీస వేతనం రూ. 26000/-,చెల్లించాలని, ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలని AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు, బుధవారం రోజున ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్ ప్రవీణ్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలు వీరికి కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు అలాగే పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించి ఈపీఎఫ్, ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు.




**ముఖ్య సమస్యలు:**

1. పెండింగ్ జీతాలు: సిబ్బందికి ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలను అడిగితే 'రేపు–మాపు' అంటూ కాలయాపన చేస్తున్నారు.
2. EPF, ESI మోసం: కొన్ని ఏజెన్సీలు ఉద్యోగుల EPF డబ్బులను సక్రమంగా జమ చేయడం లేదు. ESI కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు.
3. పేస్లిప్‌లు లేవు: నెలవారీ జీతం చీటీలు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

**యూనియన్ డిమాండ్లు:**

1. పెండింగ్‌లో ఉన్న అన్ని జీతాలను వెంటనే చెల్లించాలి.
2. ప్రతి నెలా తేదీ. 1న జీతాలు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలి.
3. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనం 26 వేలు అమలు చేయాలి.
4. EPF డబ్బులు జమ చేయని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి, ఉద్యోగులకు EPF, ESI పూర్తి వివరాలు తెలియజేయాలి.
5. ప్రతి నెలా 1వ తేదీన పేస్లిప్, గుర్తింపు కార్డు, డ్రెస్ కోడ్, అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలి.
6. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలు వీరికి కూడా చెల్లించాలి అలాగే ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.

ఈ కార్యక్రమంలో సిబ్బంది మమత, మాదేవి, భార్గవి, మల్లేష్, తపాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలను కాపాడే వైద్యుల సేవలు చిరస్మరణీయం

- **ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో డాక్టర్ల పాత్ర అత్యంత కీలకం**
- **జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా టీపీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డా. ఎం.రాజీవ్**

**హైదరాబాద్, జులై 01 (నిజాయితి):**
ప్రాణాలను కాపాడే బాధ్యతను అత్యంత నిబద్ధత, సేవా దృక్పథంతో నిర్వర్తిస్తున్న వైద్యుల సేవలు సమాజానికి అమూల్యమైనవని టీపీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డా. ఎం రాజీవ్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని వైద్యులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య వృత్తి కేవలం ఉద్యోగం కాదని, అది మానవత్వానికి ప్రతీకగా నిలిచే గొప్ప సేవా ధర్మమని పేర్కొన్నారు. రోగికి మందులు అందించడమే కాకుండా, అతనిలో జీవించాలనే ఆశను, ధైర్యాన్ని నింపే గొప్ప బాధ్యతను వైద్యులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ప్రతి రోజు వేలాది మంది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కుటుంబాలకు దూరంగా ఉండి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వైద్యుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని చెప్పారు. ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, అంటువ్యాధుల వ్యాప్తి, అత్యవసర పరిస్థితులు వంటి క్లిష్ట సందర్భాల్లో సైతం వైద్యులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది ప్రదర్శించిన సేవా తపనను దేశ ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని పేర్కొన్నారు. వైద్యుల త్యాగం, అంకితభావం, సేవా స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఆరోగ్యవంతమైన రాష్ట్ర నిర్మాణానికి బలోపేతమైన ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఎంతో అవసరమని డా. రాజీవ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పలు కీలక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల విస్తరణ, వైద్యులు, సిబ్బంది నియామకం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వివరించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచే దిశగా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపడుతోందని అన్నారు.



వైద్యులు సమాజానికి వెన్నెముకలాంటివారని, వారి సేవలను గుర్తించి ప్రతి ఒక్కరూ గౌరవించాలని డా. రాజీవ్ పిలుపునిచ్చారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రతి వైద్యుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. వైద్యుల అంకితభావం, సేవా తపన, మానవత్వం సమాజానికి ఎల్లప్పుడూ

# ఆర్‌ఎక్స్ హాస్పిటల్స్‌లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



**హైదరాబాద్, జులై 01 (నిజాయితి):**
వైద్య వృత్తి సమాజానికి సేవ చేసే అత్యంత పవిత్రమైన వృత్తి అని ఆర్‌ఎక్స్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్లు పేర్కొన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా హయత్‌నగర్‌లోని ఆర్‌ఎక్స్ హాస్పిటల్స్‌లో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యుల సేవలను కొనియాడుతూ పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్లు డా. ఎం. రాజీవ్, మాట్లాడుతూ.. సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం శ్రమిస్తుంటారని తెలిపారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ఆర్‌ఎక్స్ హాస్పిటల్స్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. డా. ఎం. సాయి కృష్ణ మాట్లాడుతూ, వైద్య వృత్తి అనేది కేవలం ఉద్యోగం కాదని, సేవా దృక్పథంతో కూడిన బాధ్యత అని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిరంతరం కృషి చేస్తోందన్నారు. డా. నాగేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి వైద్యుడి బాధ్యత అని పేర్కొన్నారు. రోగులకు సకాలంలో సరైన చికిత్స అందించేందుకు వైద్య బృందం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. డా. గుడ్డేటి శివ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, నివారణ చికిత్స కంటే ఉత్తమమని, ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జీవనశైలిలో మార్పులు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు.
డా.జి. కొండల్ యాదవ్ మాట్లాడుతూ, వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, రోగుల ఆరోగ్యమే తమకు అత్యంత ప్రాధాన్యమని చెప్పారు. భవిష్యత్తులో మరింత ఆధునిక సదుపాయాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. దశరథం రాథోడ్, నర్సింగ్ సిబ్బంది, పరిపాలన విభాగం ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం వైద్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. డాక్టర్స్ డే వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.




# అనాధాశ్రమంలో పండ్ల పంపిణీతో డాక్టర్స్ డే వేడుకలు

### సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

### ముఖ్య అతిథిగా డాక్టర్ సెల్ జిల్లా చైర్మన్ డా. సింధుజ

**హైదరాబాద్, జులై 01 (నిజాయితి):**
వైద్య వృత్తి అనేది కేవలం రోగులకు చికిత్స అందించడానికే పరిమితం కాకుండా సమాజ సేవకు అంకితమై ఉండాలని చాటిచెబుతూ శ్రీ సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఓ అనాధాశ్రమంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి వారితో ఆప్యాయంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ డీసీసీ డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ జిల్లా చైర్మన్ డా. సింధుజ హాజరయ్యారు. ఆమె చిన్నారులకు స్వయంగా పండ్లు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డా. సింధుజ మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలు, అనాథలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వైద్యుల సేవాభావం ప్రతిబింబిస్తుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు సామాజిక సేవలోనూ వైద్యులు ముందుండడం అభినందనీయమని కొనియాడారు. ఆసుపత్రులు ఆరోగ్య సేవలతో పాటు మానవతా కార్యక్రమాలను కూడా చేపట్టడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది డాక్టర్స్ డేను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం తమ సంస్థ సంప్రదాయమని తెలిపారు. భవిష్యత్తులో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, పేదలకు వైద్య సహాయం వంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని వెల్లడించారు. సేవా కార్యక్రమం అనంతరం వైద్య బృందం చిన్నారులతో కొంతసేపు మమేకమై వారికి శుభాకాంక్షలు తెలియజేసింది. అనాధాశ్రమంలోని చిన్నారులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ స్టేట్ జనరల్ సెక్రటరీ డా. కార్తీక్, శ్రీ సింధు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, సామాజిక సేవకులు, అనాధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangana - 509209, Publisher, Owner And Printer, Gundur Shyam , Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com Ph 9441946907